# కర్నూలు । నంద్యాల వార్త

29 జూలై 2025 | మంగళవారం | పేజీలు 4


## పి 4 విధానం లో.. భాగస్వాములు కండి

**: జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా**

**కర్నూలు,జూలై 28,ప్రభాతవార్త:** పేదరిక నిర్మూలన కోసమే రాష్ట్ర ప్రభుత్వం పి 4 విధానం అమలు చేస్తోందని, పేదలను ఆదుకునేందుకు పి 4 విధానం లో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో పి4 విధానం అమలు పై విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, వైద్యులు, కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తదితరులతో భాగస్వామ్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో అవసరం లో ఉన్న వారికి సాయం చేయడం పుణ్య కార్యం అని, ఈ అవకాశం పి 4 విధానం ద్వారా లభిస్తోందని పేర్కొన్నారు..మనం అందరం ఎప్పుడో ఒకప్పుడు సాయం పొందినవారయి ఉంటామని కలెక్టర్ గుర్తు చేశారు..మనం చేసే చిన్న సాయం అవసరం లో ఉన్న కుటుంబానికి ఎంతో ఆసరా ఇస్తుందని, సమాజంలో సాయం చేయగలిగిన సామర్థం ఉన్నవారు మానవతా కోణంలో ముందుకు రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు..

పేదరికం నిర్మూలించడమే పి4 పాలసీ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు..పి 4 కార్యక్రమాన్ని మార్చి 30వ తేదీన



ముఖ్యమంత్రి ప్రారంభించారని, జరిగిందని, ఆగస్టు 15 వ తేదీ లోపు రాష్ట్రంలో 15 లక్షల మంది బంగారు కుటుంబాల దత్తతను లక్ష్యంగా నిర్ణయించారని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామంలో కనీసం తినడానికి తిండి కూడా లేనివారు, ఆర్థికంగా, ఆరోగ్య పరంగా, విద్య పరంగా వెనుకబడిన కుటుంబాలను జిల్లాలో సర్వే చేసి 64 వేల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు..బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసే వారిని మార్గదర్శులుగా పేర్కొనడం జరుగుతోందని, ఇప్పటి వరకు 22 వేల కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శులుగా ముందుకు వచ్చారన్నారు.. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా .బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ , సిపిఓ హిమ ప్రభాకర్ రాజు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్, విద్యావేత్తలు, పారిశ్రామిక వేత్తలు, వైద్యులు, స్వచ్ఛంద సేవా సంస్థలు తదితరులు పాల్గొన్నారు..

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదు

**: జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలోని అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపకుండా బాధితుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను అధికారులు నిర్లక్ష్యం చూపకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రజలు జిల్లా నలుమూలల నుంచి ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం పిజిఆర్ఎస్ సమావేశానికి వస్తుంటారని అధికారులు వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్మెంట్ వారికి అర్థమయ్యే విధంగా స్పష్టంగా ఇవ్వాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా నిర్దేశించిన గడువు లోపల పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు సమస్యలపై 233 దరఖాస్తులను అర్జీదారులు కలెక్టర్ కు సమర్పించారు. ఈ సమస్యలన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సిద్దాపురం చెరువులో.. ఉరకలు వేస్తున్న కృష్ణమ్మ జలాలు..!

- సిద్దాపురం చెరువుకు లిఫ్టుఇరిగేషన్ ద్వారా సాగునీరు విడుదల
- గంగమ్మకు జలహారతి చిరసారెతో స్వాగతం పలికిన ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి
- సిద్దాపురం ఎత్తిపోతాల పథకం అభివృద్ధి పనులకు రూ.86కోట్ల అనుమతులు
- 5వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు మరో తూమ్ ప్రారంభం





**ఆత్మకూరు,జూలై28,ప్రభాతవార్త:** ఎన్నో సంవత్సరాల నుంచి రైతన్నల కలలను నిజం చేసి రైతుల పండించిన పంటకు సాగునీరు పుష్కలంగా ఉండాలనే ఆశయంతో రైతన్నల శ్రేయొస్సు కోసం నిరంతరం పాటుపడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బుడ్డా వెంగళరెడ్డి ఎత్తిపోతాల పథకం పేరు పెట్టి సిద్దాపురం చెరువు నుంచి 26వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సోమవారం మండల పరిధిలోని సిద్దాపురం స్టేజి-2 పంప్ హౌస్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తెలుగు గంగా జలాశయం నుంచి కృష్ణ జలాలను లిఫ్ట ఇరిగేషన్ ద్వారా ఎత్తిపోతాల పథకం ప్రారంభించి నీటిని శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి విడుదల చేశారు. డెలవరి పాయింట్ వద్ద చెరువులోకి వెళ్తున్న కృష్ణ జలాలకు సారె సమర్పించి జలహారతితో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ దేవుని ఆశీస్సులతో ఈ ఏడాది నెల రోజుల ముందుగానే శ్రీశైలంతో సహా రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు నిండాయని హర్శం వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వ హయంలో ప్రాజెక్టులను నాశనంచేసి కనీసం గ్రీస్ కూడా ఇవ్వలేని అసమర్దుల పాలన రైతులకు శాపంగా మారిందని గుర్తు చేశారు. ఏడాది ఎన్డిఏ పాలనలోనే తెలుగు గంగా సిద్దాపురం చెరువుల నిర్వహనకు రూ.9కోట్లు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులను కొనసాగించామని గుర్తుచేశారు. ప్రస్తుతం సిద్దాపురం ఎత్తిపోతాల పథకం సాగునీటి కాల్వలు, లైనింగ్ హైవల్ కేబుల్ తదితర పనులు చేపట్టేందుకు రూ.86కోట్లతో అనుమతులు వచ్చాయని గుర్తు చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో సిద్దాపురం ప్రాజెక్టు అడవిని తలపించే విదంగా ముళ్లపొదాలతో నిండి ఉందని అన్నారు. గండి పడిన అప్పటి పాలకులు స్పందించకపోవడంతో ఆనాటి అసమర్దత పాలకులు చేసిన దౌర్భాగ్యానికి పంటలకు సాగునీరు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు శ్రీశైలం నియోజకవర్గం మండల పరిధిలోని గ్రామీణ ప్రాంత రైతుల నుంచి శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మరో 5వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రత్యేక తూమ్లను ఏర్పాటు చేసి రైతుల కలలో ఆనందోత్సం చేస్తూ నేటి నుంచి సిద్దాపురం చెరువుతో సాగునీటికి కొరత లేకుండా పుష్కలంగా రైతులకు నీరు అందుబాటులో ఉండనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేసి కేనాల్ చైర్మన్ బన్నూర్ రామలింగారెడ్డి, మండల అధ్యక్షులు రవీంద్రబాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు జెట్టి వేణుగోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్బులాపురం బాష, వెంకటాపురం టిడిపి సీనియర్ నాయకులు రాజేంద్రారెడ్డి, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు, మురహరి అరుణ్కుమార్, బాపణంతాపురం టిడిపి నాయకులు డీలరు అసోసియేషన్ మండల అధ్యక్షులు శివప్రసాద్రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



## చట్టపరంగా న్యాయం..

**: ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 104 ఫిర్యాదులు.**



**కర్నూలు, జూలై 28, ప్రభాతవార్త :** కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 104 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీ హుస్సేన్ పీరా , సీఐ లు పాల్గొన్నారు.

## మైనర్ డ్రైవింగ్ పై అవగాహన..

**కర్నూల్ హాస్పిటల్ జూలై 28 ప్రభాతవార్త ః** ఈరోజు సాయంకాలం బిర్లా కాంపౌండ్ శ్రీ చైతన్య కాలేజ్ విద్యార్థులకు త్రీ టౌన్ సీఐ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఇందులో భాగంగా మైనర్లు డ్రైవింగ్ చేయకూడదని 17 ఏళ్లు దాటిన వారు ఎల్ఎల్ఆర్ అప్లై చేసుకుని వాహనాలు నడపవచ్చని వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ కచ్చితంగా ధరించాలని అలాగే వెనక వ్యక్తులు కూడా హెల్మెట్ ధరించాలని సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని త్రీ టౌన్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన నిర్వహించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థినిలు 3 టౌన్ పోలీస్ వారు పాల్గొన్నారు



## బిజెపిని రాష్ట్రంలో బలోపేతం చేస్తా

**: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవిఎన్ మాధవ్**



**నంద్యాల జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి :** బిజెపిని రాష్ట్రంలో బలోపేతం చేస్తానని, రానున్న రోజుల్లో ప్రతి కార్యకర్త ఇంటికెల్లి తలుపు తట్టి యోగ క్షేమాలు తెలుసుకుంటానని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవిఎన్ మాధవ్ పేర్కొన్నారు. నిన్న దేవుని కడప నుంచి ప్రారంభించానని రెండో రోజు సోమవారం నవనందుల గడ్డలో అడుగు పెట్టానని ఆయన అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నంద్యాల జిల్లాలో సోమవారం పర్యటన ఇలా కొనసాగింది. ఉదయం పార్టీ కార్యాలయంలో పాల్గొని జేష్ఠ కార్యకర్తలకు సత్కారం చేశారు. అనంతరం మొక్కలు నాటి, 100 ఏళ్ల చరిత్ర కలిగిన మారుతీ వ్యాయమ మండలిని సందర్శించారు. పర్యటనలో ఆయనకు కార్యకర్తలు ఉత్సాహంగా స్వాగతం పలికారు. అనంతరం నంద్యాలలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్ పర్యటించారు. స్థానిక పద్మావతి నగర్ నుంచి వై జంక్షన్ వరకు బీజేపీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సౌజన్య ఫంక్షన్ హాల్లో జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగరవేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని, రాయలసీమను రతనాలసీమగా మార్చి ఈ ప్రాంతానికి నీళ్లు, ఉద్యోగాలు, ప్రాజెక్టులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకెళ్తోందన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటానని, అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా అందరికి అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి ని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అభిరుచి మదు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తోపాటు జిల్లాలో ఉన్న అసెంబ్లీ కన్వీనర్లు మండల అధ్యక్షులు, బూతు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజలను పదేపదే తిప్పుకోవద్దు..

**: చట్టపరిధిలో సమస్యలను త్వరితగతిన పరిష్కారించాలి ..**

**: నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ..**

**: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 23 అర్జీలు**



**కర్నూలు, జూలై 28, ప్రభాతవార్త :** సోమవారం నగర నలుమూలల నుండి నగరపాలక కార్యాల యానికి వచ్చే ప్రజలను పదేపదే తిప్పుకోవద్దని, ఏవైనా చిన్నపాటి పత్రాలు, పనుల కోసం చరవాణి వినియోగించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. చట్టపరిధికి లోబడి సమస్యను పరిష్కరించాలని, అందుకు విరుద్ధంగా ఏవైనా ఉంటే అర్జీదారుడికి స్పష్టంగా వివరించాలని సూచించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుండి 23 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓ జునైద్, ఎంఈలు శేషసాయి, లీల ప్రసాద్, మనోహర్ రెడ్డి, హార్టికల్చర్ ఏడి విజయలక్ష్మి, టిపిఆర్ఓలు వెంకటలక్ష్మి, శ్రీనివాసులు , పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం

**: లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలి : జిల్లా కలెక్టర్**

**కర్నూలు, జూలై 28, ప్రభాతవార్త :** అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు..పిజిఆర్ఎస్ లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని, అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు...సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల జిల్లా కో ఆర్డినేటర్ లాగిన్ లో వారం రోజుల నుండి, డిఎస్డిఓ లాగిన్ లో 13 రోజుల నుండి అర్జీలు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, కర్నూలు లాగిన్ లో 11 రోజుల నుండి, కర్నూలు అర్బన్ తహసిల్దార్ లాగిన్ లో వారం రోజుల నుండి 1 అర్జీ, ఆదోని సబ్ రిజిస్ట్రార్ లాగిన్ లో వారం రోజుల నుండి అర్జీలు చూడకుండా పెండింగ్ లో ఉన్నాయన్నారు..లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. సిఎంఓ గ్రీవెన్స్ లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 13, పత్తికొండ ఆర్డీఓ వద్ద 6, కర్నూలు ఆర్డీఓ వద్ద 7, సర్వే ఏడి, డీఎస్డీవో, కర్నూల్ మున్సిపల్ కమిషనర్, డిఆర్డిఏ పిడి, హౌసింగ్ పీడీ, మెప్మా పీడీ, ఇరిగేషన్ ఎస్ఈ , వక్ఫ్ బోర్డు ల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్ లో ఉన్న వాటిని గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే అర్జీలు రీ ఓపెన్ లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు..



## డ్రోన్ నిఘా నేత్రంతో.. మందుబాబులకు వల..

**చాగలమర్రి, జూలై 28, ప్రభాతవార్తః** డ్రోన్ కెమెరాలతో మందు బాబులను గుర్తించేందుకు డ్రోన్కెమెరాలతో పోలీసులు నిఘా ఉంచారు. సోమవారం మండలంలోని చాగలమర్రి పలు ప్రాంతాలతో పాటు చింతలచెరువు, భైరవగుండాల, బుగ్గరస్తా, నారాయణపల్లె రస్తా, కలుగోట్లపల్లె రస్తాల్లో డ్రోన్ కెమెరాతో మందు బాబుల కోసం అన్వేషించారు.ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ ఎస్పీ అధిరాజ్ సింగ్ అదేశాలతో ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్ సూచనల మేరకు రూరల్ సిఐ మురళీదర్రెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ సురేష్, క్యూఆర్టీ సిబ్బంది స్టేషన్ సిబ్బందితో కలిసి వివిధ ప్రాంతాల్లో డ్రోన్లతో అన్వేషించారు. ఈసందర ్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మందు తాగకుండా నిషేదించేందుకే డ్రోన్తో అన్వేషణ నిర్వహించామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మందు తాగి పట్టుబడితే కేసులు నమోదుచేయడం జరుగుతుదని తెలిపారు.



## మూడు దశాబ్ధాలకే..!

- శిథిలావస్థలో పగిడ్యాల తహశీల్దార్ కార్యాలయం
- ఆందోళనతో విధులు నిర్వహిస్తున్న అధికారగణం



**పగిడ్యాల, జూలై 28,ప్రభాతవార్త** " సమాజమే దేవాలయం ప్రజలేదేవుళ్ళు" అని నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు కొత్త నిర్వచనం ఇచ్చారు. అన్నదితడువుగానే అచరణలో పెట్టి ప్రజల మన్ననలు పొందిన ప్రజానాయకుడు నందమూరి తారక రామారావు. ప్రజల వద్దకు పాలన అనే నినాదంతో ప్రభుత్వాలున్నా ప్రత్యామ్నయ పరిపాలన కొనసాగిస్తూ రాజకీయాలను ప్రభావితము చేస్తున్నారనీ తలంచి తర తరాలుగా కొనసాగుతున్న రెడ్డి, కర్ణాల వ్యవస్థను రద్దుచేసిన ధీశాలి. రెడ్డి కర్ణాల వ్యవస్థకు ప్రత్యామ్నయంగా 1987లో మండల వ్యవస్థను ఏర్పాటు చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ప్రజలకునేరుగా పరిపాలన అందించేందుకు గాను అందుకు సంబంధించిన తహశీల్దార్ కార్యాలయం, మండల అభివృద్ధి కార్యాలయం, పోలీస్టేషన్, ఉపఖజానా కార్యాలయం, బ్యాంకు, ప్రజల సౌకార్యార్థం ప్రభుత్వ శాఖలను ఏర్పాటు చేశారు. అందుకు సంబంధించిన మండల స్థాయి అధికారులతో పాటు సిబ్బందిని నియమించి నూతన ప్రజాపరిపాలనకు శ్రీకారం చుట్టిన ఘనత నందమూరి తారక రామారావు దక్కింది. రాజకీయ చైతన్యానికి పునాదులువేసి ప్రజలలో రాజకీయ చైతన్యం కలిగించి చరిత్రలో స్థిరస్థాయిగా నందమూరి తారక రామరావు



నిలిచిపోయారు. ఉన్నత అశయంతో మండల వ్యవస్థను ఏర్పాటు చేసి అందుకు సంబంధించిన కార్యాలయాల నిర్మాణం కోసం లక్షలాధి రూపాయలు వెచ్చించారు. తహశీల్దార్, మండల అభివృద్ధికార్యాలయం, ఉపఖజానా కార్యాలయాల నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ హాయాంలో చేపట్టారు. అయితే అధికారుల పర్యవేక్షణ లోపం తోపాటు కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కు కావడంతో కార్యాలయాల నిర్మాణంలో నాణ్యత లోపించడంతో నిర్మించి మూడు దశాబ్దాలకు కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకోవడం శోచనీయం. అందుకు నిదర్శనం పగిడ్యాల తహశీల్దార్ కార్యాలయము. మండల ప్రజలు రెవెన్యూకు సంబంధించిన పనుల నిమిత్తం నిత్యం మండలంలోని వివిధగ్రామాల నుంచి వచ్చిపోయే జనంతో కిక్కిరిసిపోతుంది. అయితే కార్యాలయము శిథిలావస్థకు చేరుకోవడంతో కార్యాలయ సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. చినుకు పడితేచాలు కార్యాలయం చిత్తడిగా మారుతొంది. దీంతో పాటు, కంప్యూటర్ గది, రెవెన్యూ ఇన్సెక్టర్ గది, చివరికి తహశీల్దార్ కార్యాలయము మూలన పెచ్చులు ఇటీవల ఊడిపడ్డాయి. గతంలో కార్యాలయం భవనం పైపెచ్చులు ఊడిపడంతో ప్రమాదంతృటిలో తప్పిన సంఘటనలు జరిగినట్లు సమాచారం. అయినా కార్యాలయము మరమ్మత్తులకు నోచుకోకపోవడం విచారకరం. భవనం పైపెచ్చులు కార్యాలయం సిబ్బందిపై పడటంమేకాక పనులనిమిత్తం కార్యాలయానికి వచ్చేజనంపైన పడితృటిలో ప్రమాదాల నుంచి తప్పిన సంఘటనలు లేకపోలేదు. చినుకుపడితే రెవెన్యూ రికార్డులు తడిసిముద్దకాగా వాటిని అరబెట్టడం జరిగినట్లు తెలిసింది. బీర్వాలున్నావాటిపై వర్షం కురిసిన ప్రతిసారి పాటుకు పెట్టడంతో రికార్డులను సిబ్బంది భద్రపరిచేందుకు నానాయాతన పడుతున్నారు. కావున సిబ్బంది, ప్రజల అవసరాలను దృష్టిలోవుంచుకుని భవనం పైపెచ్చులు పడిప్రమాదం జరిగిన తరువాత చర్యలు తీసుకోకుండా ముందుజాగ్రత్తగా చర్యలుచేపట్టాలనీ పలువురు కోరుతున్నారు. శిథిలావస్థకు చేరిన తహశీల్దార్ కార్యాలయం పూర్తిగా పడగొట్టి నూతనంగా తహశీల్దార్ కార్యాలయం నిర్మించవలసిన అవసరంఎంతైనావుందనీ మండల ప్రజలు కోరుతున్నారు.

## రాష్ట్రం కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి

**- ఎంఎల్ఏ గిత్త జయసూర్య**

**పగిడ్యాల, జూలై 28,ప్రభాతవార్త :** రాష్ట్రం కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి చెందుతుందనీ ఎంఎల్ఏ గిత్త జయసూర్య అన్నారు. " సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో బాగంగా సోమవార రాత్రి పగిడ్యాల మండలం ఆంజనేయనగర్, బీరవోలు గ్రామములో ఎంఎల్ఏ గిత్త జయసూర్య పర్యటించారు. ముందుగా ఆంజనేయనగర్లో గ్రామ నాయకులు విజయకుమార్ చౌదరి ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన అభివృద్ధి - సంక్షేమ పథకాలు గురించి ఎంఎల్ఏ గిత్త జయసూర్య వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయాలేదా అనీ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. అన్నివర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్టీఆర్ భరోసా ఫించన్లపెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, తల్లికి వందనం పథకాలు చేస్తున్నందుకు మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం బీరవోలు గ్రామములో ఎంఎల్ఏ గిత్త జయసూర్యకు స్థానిక టిడిపి నాయకులు, అభిమానులు స్వాగతం పలికారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతో సాధ్యమన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని అన్నిగ్రామాలలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమములో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. అధికారంలోకి వచ్చాక బీరవోలు గ్రామములో సిసిరోడ్లు వేయించినందుకు ఎంఎల్ఏ గిత్త జయసూర్యకు పలువురు అభినందనలు తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేస్తున్నామనీ ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామనీ ఎంఎల్ఏ గిత్త జయసూర్య తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పలుచాని మహేశ్వరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బొగ్గుల దామోదరెడ్డి, నంద్యాల పార్లమెంటు టిడిపి యువజన నాయకులు మద్దిలేటిగౌడు, లక్ష్మాపురం మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి గోవిందు, టిడిపి నాయకులు పుల్యాల శ్రీనివాసరెడ్డి, అలియాస్ వాసురెడ్డి, ఒగిలి శ్రీనివాసులు, పగడం శేఖర్, లక్ష్మన్న, చెన్నకేశవులు, లింగన్న, కృష్ణగౌడు, శ్రీను, నాగరాజు, సాతానుబాబు, హనుమన్న, ఎల్లస్వామి, వెంకటేశ్వర్లు, శేఖర్,నీటి తీరువాసంఘం డైరెక్టర్ గుంపుల రామకృష్ణ, కూటమి నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



# పేదల బతుకుల్లో వెలుగులు నింపేలా పీ4

**: జిల్లాకు ఇచ్చిన పి4, లక్ష సాధనకు అధికారులు కృషి చేయాలి : జిల్లాకు పుష్కలంగా యూరియా ఎక్కడా యూరియా సమస్య రాకూడదుసంక్షేమ వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలిజిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**

**నంద్యాల, జూలై 28, జూలై 28,ప్రభాతవార్త :**




జిల్లాలో పి4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించి పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం జరుగుతుందని జిల్లాలోని అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పి4, లక్ష్యసాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్లో పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పేదల బతుకుల్లో వెలుగులు నింపేలా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పి4, కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. నంద్యాల జిల్లాలో మొత్తం 42,937 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉండగా అందులో 41,613 కుటుంబాలు దత్తత తీసుకోవడం జరిగిందని ఇంకా 1,324 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉందన్నారు. కావున జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించి ప్రతి ఒక్క బంగారు కుటుంబానికి సాయం చేసి నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందని ప్రతి ఒకరు సీఎం గారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో ఆధార్ బయోమెట్రిక్ అప్డేషన్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ 10 సంవత్సరాలకు ఒకసారి ఆధార్ అప్డేషన్ తప్పకుండా చేయించుకోవాలన్నారు. సిటిజన్ ఈ కేవైసీ కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం బర్త్ సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని బర్త్ సర్టిఫికెట్ ల రిజిస్ట్రేషన్ లు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. జిల్లాలో పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరిగే కార్యక్రమాలను తప్పకుండా ఆర్ టి జి ఎస్ లో అప్లోడ్ చేయాలన్నారు. సంబంధించి మన జిల్లాకు 50 వేల టార్గెట్ ఉందని ప్రస్తుతం 2275 డాక్యుమెంట్స్ మాత్రమే అప్లోడ్ చేయడం జరిగిందన్నారు. ప్రతి డిపార్ట్మెంట్లో మంచి మంచి ప్రాజెక్టులు ఉంటాయని అవన్నీ తప్పకుండా ఆర్టిజిఎస్ లో అప్లోడ్ చేసి జిల్లాకి ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు. ఇకనుంచి కలెక్టర్ కాన్ఫరెన్స్ కు ఎవరు ప్రజెంటేషన్ తీసుకు రావాల్సిన అవసరం లేదని ఆర్ టి జి ఎస్ లెన్స్ లో ఏమి ఇన్ఫర్మేషన్ ఉందో దాన్నే రివ్యూ చేయడం జరుగుతుందన్నారు. ఆర్టిజిఎస్ లెన్స్ లో ఏ డిపార్ట్మెంట్ కు సంబంధించి ఏమేమి ఇండికేటర్స్ ఉన్నాయో ఒకసారి ప్రతి అధికారి తెలుసుకోవాలన్నారు. ఇకనుంచి ప్రతి ఒక్క అధికారి తమ పరిధిలో జరుగుతున్న ప్రాజెక్టు వివరాలను ఆర్టిజిఎస్ లో తప్పకుండా అప్లోడ్ చేయాలన్నారు. అవసరం మేరకు మాత్రమే పంటలకు యూరియా వాడాలన్నారు. మనం నదీ పరివాహక ప్రాంతంలో ఉన్నామని ప్రస్తుత వర్షాకాలంలో ఎక్కువ వాటర్ వచ్చి ప్రమాదం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కుందు పరివాహక ప్రాంతంలో 72 గ్రామాలు ఉన్నాయన్నారు. వీరు జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలో ఉన్న సంక్షేమ వసతి గృహాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొని విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించా లన్నారు. ఈమధ్య ఆళ్లగడ్డ మండలం, పడగండ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ మండల ప్రాథమిక ఆదర్శ పాఠశాలను విసిట్ చేయడం జరిగిందని ఈ పాఠశాల ముందు మొత్తం మురికి నీటితో నిండి విద్యార్థులు లోపలికి రావాలంటే మురికి నీరు అంతా తొక్కుకుంటూ రావాల్సిన పరిస్థితి ఉందన్నారు. అలా ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాల ముందరికి మురికి నీరు వస్తుంటే ఉపాధ్యాయులు అధికారులు చూస్తూ ఉండడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. మోడల్ స్కూల్ అంటే అన్ని పాఠశాలలకు ఆదర్శంగా ఉండాలని అర్థం... కానీ పడగండ్ల గ్రామంలోని ఆదర్శ పాఠశాల అపరిశుభ్రంగా ఉండడం చాలా బాధాకరమన్నారు. ఇకనుంచి ప్రతి పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కటి విద్య అందించాలన్నారు.

## జక్కు శేషమ్మ మృతికి బీసీ ఇందిరా రెడ్డి సంతాపం

**బనగానపల్లె రూరల్, జూలై 28, ప్రభాతవార్త:**



బనగానపల్లె పట్టణంలోని తెలుగుపేటకు చెందిన టీడీపీ కార్యకర్త జక్కు నాగార్జున, తల్లి జక్కు శేషమ్మ ఆకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలికసదుపాయాలు, మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి, రాష్ట్ర థాయ్ బాక్సింగ్ చైర్ పర్సన్ బీసీ ఇందిరా రెడ్డి వెంటనే అక్కడికి చేరుకొని శేషమ్మ మృతదేహానికి నివాళులు అర్పించారు. తల్లిని కోల్పోయి రోధిస్తున్న నాగార్జునకు ధైర్యం చెప్పి శోకతప్తులైన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శేషమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ,వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని బీసీ ఇందిరా రెడ్డి హామీ ఇచ్చారు.

## పట్టణంలో ఘనంగా నాగుల చవితి వేడుకలు

**: భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తాదులు : సిద్దేశ్వరాలయంలో నాగులకట్ట దగ్గర పూజలు : ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నరహరి సత్యనారాయణ దంపతులు**

**ఆత్మకూరు, జూలై28, ప్రభాతవార్త:**



నాగులచవితి పండుగను పురష్కరించుకునేందుకు భక్తాదులు తెల్లవారుజాము నుంచి పుణ్యస్నానాలు చేసి నాగులకట్ట దగ్గర పుట్టకు పాలుపోసి భక్తాదులు మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం పట్టణంలోని సిద్దేశ్వరాలయంలో వెలసిన నాగుల కట్ట దగ్గర పూజలు నిర్వహించేందుకు కుటుంబ సమేతంగా భక్తాదులు అధిక సంఖ్యలో తరలి వచ్చి నాగదేవతకు తమ మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబ సమేతంగా తరలి వచ్చి నాగదేవతకు



పాలాభిషేకం, కుంకుమ్మ అర్చనాలతో పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నరహరి సత్యనారాయణ దంపతులు హజరై పూజలు చేసి నాగదేవతకు దీపనైవేద్యాలు అందించి పూలమాలలతో ప్రత్యేక అలంకరణలు చేశారు. నాగుల చవితి పండుగ సందర్బంగా నాగదేవత పండుగను ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో జరుపుకోవడం గొప్ప విశేషంగా బావించి భక్తాదులు సంప్రదాయ పండుగలను కొనసాగిస్తున్నారు. కొత్త కొబ్బెరగినెలు, నువ్వుల ముద్దాలు, పాలు విశేష ప్రసాదాలు నాగదేవతకు భక్తాదులు సమర్పించారు.

## తుంగభద్ర నది ప్రవాహాన్ని పరిశీలించిన అధికారులు

**– నదీ తీరంలో స్నానాలు చేసేందుకు భక్తులకు అనుమతి లేదు**

**మంత్రాలయం, జూలై28, ప్రభాతవార్త;**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘ వేంద్రస్వామి మఠం వెనుక భాగంలో ఉన్న తుంగభద్ర నది ప్రవాహాన్ని మంత్రా లయం తహసీల్దార్ రమాదేవి, సీఐ రామాంజులు, ఎస్ఐలు శివాంజల్, మాధవరం ఎస ఐ విజయ్ కుమార్ సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. శనవారం ఉదయం తుంగభద్ర డ్యాం నుంచి గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో తుంగభద్ర నది ఉదృతంగా ప్రవహిస్తోంది. తుంగభద్ర నది ఉదృతంగా ప్రవహిస్తుండడంతో నదిలోకి భక్తులను అనుమతించవద్దని తమ సిబ్బందికి, శ్రీమఠం సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. భక్తులు శ్రీమఠం వారు ఏర్పాటు చేసిన షవర్ల ద్వారానే స్నానాన్ని ఆచరించాలని తెలిపారు. అలాగే శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ఉన్న మైకుల ద్వారా భక్తులకు, గ్రామస్తులను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేయించారు. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీఆర్వో భీమయ్య, శ్రీమఠం సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

**–సిఐ దస్తగిరి బాబు**

**రుద్రవరం, జూలై 28, ప్రభాతవార్తః**



మండల పరిధిలోని అప్పనపల్లె, గోనం పల్లె గ్రామాల్లో శిరివెళ్ళ సిఐ దస్తగిరి బాబు తల్లిదండ్రులతో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఆయన తెలిపారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలకు కనీస వయసుల స్త్రీలకు 18 సంవత్సరాలు పురుషులకు 21 సంవత్సరాలువచ్చే వరకు వివాహాలు చేయరాదన్నారు. అలా చేస్తే చట్ట రీతాయ నేరస్థులు అవుతారన్నారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పక ఉండాలన్నారు. అలాగే కిరాణాషాపుల్లో పేడ రంగు అమ్మితే అలాంటి షాపుల యజమానులపై శాఖపరమైన చర్యలు తీసుకొని అటువంటి వారికి రూ.10 వేలు జరిమాన విధిస్తామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐలు బాలన్న రాంభూపాల్‌రెడ్డి, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సచివాలయమహిళా పోలీస్ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగులచవితి వేడుకలు

**రుద్రవరం, జూలై 28, ప్రభాతవార్తః**



శ్రావణమాసం శుద్ధచవితి పంచమిస్థితులను పురస్కరించుకొని మండలంలో నాగులచవితి గరుడ పంచమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో కొలువై ఉన్న నాగేంద్రునికి మరియు పుట్టల్లో పాలుపోసి చీరే సారెలు సమర్మిపంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులచవితి రోజు పుట్టలో పాలుపోయడం అనాదిగా వస్తున్న అచారమని ఈ పూజల వల్ల సకల దోషాలు సకల పాపాలు తొలిగిపోతాయని పూరాణాలు చెబుతున్నాయని పూజారి వారణాసి గోపిశర్మతెలిపారు. పూజలు చేయడం వల్ల కోరిన కోర్కెలు నేరవేరుతాయని సంతానం లేని వారికి పుత్ర సంతానం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈపూజా కార్యక్రమాల్లో అయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

## ఆర్‌పిలకు తక్షణమే వేతనాలు ఇవ్వాలని వినతి

**గూడూరు,జులై 28, ప్రభాతవార్త ః**

గూడూరు మండలంలో మెప్మాలో పనిచేస్తున్న మండల రిసోర్స్ పర్సన్‌కు (ఆర్‌పి)లకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్‌పిలు వేతనాల గురించి టిఎంసి రాములకు వినతి పత్రంను అందజేశారు. అనంతరం ఆర్‌పిల సంఘం అధ్యక్షురాలు ప్రభావతి యశోద మాట్లాడుతూ ఐదు నెలల పాటు తమకు జీతాలకు చెల్లించక పోతే ఎలా బతకాలని ఆందోళన వ్యక్తం చేశారు. తమతో పనులు చేయించుకోవడం తప్ప ఆర్‌పిలకు ఇవ్వాల్సిన జీతాలను చెలించడంతో తీవ్ర జాప్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిలు పార్వతి, ఫరీదా, మల్లేశ్వరీ, షమీం, కళావతి, పద్మావతి, రామాంజినమ్మ, సిఐటియు నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మండలవ్యాప్తంగా ఘనంగా నాగులచవితి వేడుకలు

**గడివేముల, జూలై28, ప్రభాతవార్త;**



మండలవ్యాప్తంగా సోమవారంనాడు నాగులచవితి వేడుకలను భక్తులు, ప్రజలుఘనంగా నిర్వహించారు. నాగుల విగ్రహాలకు ఆవుపాలతో అభిషేకాలు, నువ్వుల పిండి, చలి పిండి, పెసరబెల్లం నైవేద్యంగా ఉంచి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయాలకు చేరుకుని నాగమయ్య విగ్రహాలకు, గ్రామాల్లోని అక్కడక్కడ వెలిసిన పుట్టలో పాలు పోసి నైవేద్యం సమర్పించి, పుట్టపై పసుపు, కుంకుమ వేసి పూలు వేసి, దీపం వెలిగించారు. నైవేద్యాన్ని పుట్ట వద్ద ఉంచి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, పిల్లలు, పెద్దలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా విప్లవ ఉద్యమ నేత మజుందార్‌కు నివాళీలు

**నందికొట్కూరు, జూలై 28, ప్రభాతవార్త :**



విప్లవ ఉద్యమ నేత అమరజీవి చారు మజుందార్ 59వ వర్ధంతి సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళీలు అర్పించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు విప్లవ వేగుచుక్క నక్సల్బరి ఉద్యమ నేత చారు మజుందార్ ఆశయాలను కొనసాగిస్తామని కార్యకర్తలందరు ప్రతిజ్ఞ చేశారు. లిబరేషన్ పార్టీ విస్తరణ కోసం ప్రజా సమస్యలపై ప్రతి ఒక్కరు పని చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కాటేపోగు స్వామన్న, చెరుకుచెర్ల గాబ్రియేలు, భాస్కర్‌గౌడ్, మహాబూబ్‌బాష, నరసింహ్మ,ఎస్.బీబీ, లక్ష్మిదేవి, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఆస్తులను అధికారులు కాపాడండి

**– సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలి – ప్రజా రహదారులు ఆక్రమించిన వాటిని తొలగించాలి**

**మంత్రాలయం, జూలై28, ప్రభాతవార్త;**



ప్రజా ఆస్తులను అక్రమంగా ఆక్రమించిన వాటిని కాపాడాలని రఘు కోరారు. మంత్రాలయంలో రహదారులు అక్రమంగా ఆక్రమించారని, వాటిని తొలగించి ప్రజా ఆస్తులను కాపాడాలంటూ స్పందనలో తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలయం పుణ్యక్షేత్రం ఇక్కడికి రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు లక్షలాది మంది వస్తున్నారని తెలిపారు. వారికి సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత మఠం వారిదేనన్నారు. కొంతమంది అధికారులు మఠం అధికారులకు ఒత్తాసు పలకడం వల్ల ప్రజా ఆస్తులను ఆక్రమిస్తున్నారన్నారు. 1996 సంవత్సరంలో ప్రజాస్ఫూర్తి కలిగిన ఒక వ్యక్తి రోడ్డు విస్తరణ మరియు ఆక్రమణలు తొలగింపు కోరుతూ డబ్ల్యూపీ నంబర్ 13806 దాఖలు చేశారన్నారు. దీనిపై ఇప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రజా స్థలాల్లో శ్రీమఠానికి చెందేటట్లు, ప్రభుత్వ అధికారులు చేస్తున్నారన్నారు. 024 సంవత్సరం అక్టోబర్‌లో దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ప్రజా ఆస్తులను అక్రమంగా ఆక్రమించిన వాటిని బుల్డోజర్‌తో తొలగించాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రజా ఆస్తులను రక్షించాలని కోరారు.

## ఉరుకుంద ఈరన్నస్వామివారి సన్నిధిలో టీడీపీ సీనియర్ నాయకులు

**– కుటుంబ సమేతంగా దర్శించుకున్న చూడి ఉలిగయ్య**

**కౌతాళంరూరల్, జూలై28, ప్రభాతవార్త;**





ప్రముఖ్య పుణ్యక్షేత్రమైన మండలంలోని ఉరుకుంద ఈరన్నస్వామివారిని సోమవారం మంత్రాలయం టీడీపీ సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూలమాల వేసి ఆశీర్వదించారు. తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య మాట్లడుతూ ఉరుకుంద ఈరన్నస్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిఒక్కరికీ స్వామివారి ఆశీస్సులు పొందాలన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం చంద్రబాబునాయుడికి స్వామివారి ఆశీస్సులు కలగాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వ హయాంలో అన్నివిధాలా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆలయ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండవరోజుకు చేరిన పూజలు

**కొలిమిగుండ్ల, జూలై 28, ప్రభాతవార్తః**



కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహాస్వామి ధ్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమ పూజలు తిరుపతి తిరుమల దేవస్థానం పండితులచే రాంకో సిమెంట్ వారి సౌజన్యంతో సోమవారం ఉదయం ప్రబంధ సేవా కాలం, బాలబోగం, శాంతిపాఠం, విశ్వసేన పూజ, పున్యహావచనం, యాగశాల, యాగశాల ప్రవేశం, ద్వారా తోరణ, ధ్వజ కుంభారాధనం, అరనిమధనం, అగ్నిప్రతిష్ట, కుంభస్థాపన, చతుర్థానాచనం మూలమంత్ర జపం, నిత్యఅవణం, నిత్యపూర్ణాహుతి, తీర్థప్రసాద గోష్టి, సాయంత్రం 4 గంటలకు వాస్తుపూజ, వాస్తుహోమం, వాస్తుబలి, పరియగ్నికరణం, సాయంత్రం 6 గంటలకు శ్రీవిష్ణుపారాయణ ద్వారాతోరణ ధ్వజ కుంభరాధన, చతుర్థానాచనం, నిత్యాహవనం, మూలమంత్ర అవణం, నిత్యపూర్ణాహుతి, పుణ్యాహావచనం, జలాధివాసనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రసిడెంట్ అడ్మిన్ ఎస్ రామరాజు దంపతులు మరియు యూనిట్ హెడ్ మీనాక్షి సుందర్, జనరల్ మేనేజర్ రవికుమార్, మరియు రాంకో అధికారులు పాల్గొన్నారు.

## కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ధర్నా

**దేవనకొండ, జూలై28, ప్రభాతవార్త;**



మండలంలోని కౌలు రైతులకు గుర్తింపుకార్డులు, బ్యాంకుల్లో షరతులు లేకుండా రుణాలు మంజూరు చేయాలని ఏపీ రైతుసంఘం (ఏఐకేఎస్) మండల గౌరవాధ్యక్షులు ఎర్రగోటి కండప్ప, సీపీఐ మండల సహాయ కార్యదర్శి బజారిలు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతుసంఘం(ఏఐకేఎస్) ఆధ్వర్యంలో మండలంలోని దేవనకొండ, కరివేముల, నల్లచెలిమల, వెలమకూరు, కుంకనూరు, పి.కోటకొండ తదితర గ్రామాల్లోని సచివాలయాల ముందు రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా కూడా కౌలు రైతులకు గుర్తింపుకార్డులు, బ్యాంకులో రుణాలు ఇవ్వడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. కౌలు రైతులను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలురైతులను ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో నల్లచెలిమలశాఖ కార్యదర్శి ఎర్రిస్వామి, కరివేముల శాఖ కార్యదర్శి నరసింహులు, సీపీఐ మండల నాయకులు కృష్ణ, రవికుమార్, భూపేష్, రామంజి, నరేష్, శ్రీనివాసులు, మధు తదితర రైతులు పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్య

**క్రిష్ణగిరి, జూలై28, ప్రభాతవార్త :**

మండల పరిదిలోని అమకతాడు గ్రామానికి చెందిన తలారి రామేశ్వరమ్మ(55) అనే మహిళ కడుపునొప్పి తాళలేక పురుగుల మందు త్రాగి ఆత్మహత్య చేసుకొని మరణించింది.కుటుంబసభ్యుల వివరాల మేరకు కడుపునొప్పి,కాళ్లనొప్పులు తాళలేక జీవితంపై విరక్తి చెంది 27వ తారీఖున రాత్రి 10 గంటల సమయాన పురుగుల మందు త్రాగినది.కుటుంబసభ్యుల గమనించి డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు జనరల్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొం దుచూ కోలుకోలేక సోమవారం మరణించినది. కుమారుడు తలారి వెంకటేశ్వర్లు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు యస్.ఐ క్రిష్ణమూర్తి తెలిపారు.

## ప్రజలు సీజినల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**పత్తికొండ,జూలై 28,ప్రభాతవార్త:**

ప్రజలు సీజినల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని డాక్టర్.రాణా ప్రతాప్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని చక్రాల గ్రామంలో గ్రామ పంచాయితీ సెక్రటరీ సహాకారంతో గ్రామంలో మురికి నీటి కాలువల యందు దోమల నివారణకు పిచికారి చేశారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారి డాక్టర్.వెంకటేశ్వర్లు మాట్లాడుతు దోమల వల్ల వచ్చేయ వ్యాధులు మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి స్తానికులకు అవగామాన కల్పించారు. నీరు నిల్వ ఉంచుకున్న డ్రమ్ములు, తొట్టీలు, బిందెలు వారానిక ఒకసారి శుభ్రంగా కలడగాలని, ఇంటి పరిసర ప్రాంతాలలో చెత్త చెదారం పాత వస్తువులు ఉండకుండా చూచుకోవాలని, ప్రతి ఒక్కరు దోమతెరలు వాడాలని ఆయన తెలిపారు. జ్వరం వస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి పవన్‌కుమార్, ఆరోగ్య కార్యకర్త సంగీతాబాయి, ఎమ్.ఎల్.హెచ్.పి.రాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# భవననిర్మాణ సంక్షేమ బోర్డును ప్రారంభించాలి..



కర్నూలు, జూలై 28, ప్రభాతవార్త ప్రతినిధి : రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జీవో నెంబర్ 17ను రద్దు చేయాలని. ఈరోజు కర్నూల్ కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ లో జాయింట్ కలెక్టర్ నవ్య గారికి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునేప్ప ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్ ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి నల్లన్న నాయకులు కృష్ణ రేణుక రామాంజనేయులు కలిశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునియప్ప మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భవన. నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కరించాలని పెండింగ్ లో ఉన్న 46 క్లెయిమ్స్ ను విడుదల చేయాలని అదే విధంగా గత జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు. జీవో నెంబర్ 17ను తీసుకుని వచ్చి సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను460. కోట్లు నవరత్నాలకు వాడుకుని కార్మికులకు ద్రోహం చేశారని వారన్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు చంద్రబాబు నాయుడు గారు నా ప్రభుత్వం అధికారం లేకోస్తే కార్మికులను ఆదుకుంటాం అదేవిధంగా సంక్షేమ బోర్డులో ఉన్నటువంటి నిధులను వెంటనే సంక్షేమ బోర్డులోకి నిధులను జమ చేస్తామని అధికారులు రాకముందుకు చెప్పినటువంటి ప్రభుత్వము అధికారంలోకి వచ్చి సంవత్సరమైన భవన నిర్మాణ కార్మికుల సమస్యలు ఇప్పటివరకు పరిష్కారం చేయలేదని వారు అన్నారు ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను దృష్టిలో ఉంచుకొని పెండింగ్లో ఉన్నటువంటి డెలివరీ డబ్బులు యాక్సిడెంట్. పెళ్లి కానుకలు ఉన్నటు వంటి పెండింగ్లో ఉ న్నక్లెయిమ్స్ ను వెంటనే విడుదల చేయాలని కార్మికులను ఆదుకోవాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## కార్యాలయానికి ఉచితంగా కుర్చీలు వితరణ

పగిడ్యాల, జూలై 28,ప్రభాతవార్త :



పగిడ్యాల తహశీల్దార్ కార్యాలయానికి ఉచితంగా కుర్చీలను ముచ్చుమర్రికి చెందిన శ్రీలక్ష్మి, క్లీనిక్ అధినేత టిడిపి యువనాయకుడు కె,నాగన్న సోమవారం తహశీల్దార్ శివరాముడుకు అందజేశారు. తహశీల్దార్ కార్యాలయానికి రైతులు, ప్రజలు పనుల నిమిత్తం వచ్చి గంటల తరబడి నిల్చోని ఇబ్బందులు పడరాదనీ టిడిపి ప్రభుత్వహాయాంలో రైతులు, ప్రజలు అధికారుల ముందు నిలబడకుండా కూర్చొని సమస్యలు వివరించాలనీ, ప్రభుతా ్వనికి చెడ్డపేరు రాకుండా ఉండాలనే ఉద్ధేశ్యంతో రైతన్నల ప్రభుత్వం అని చెప్పడానికి ఉచితంగా కుర్చీలను అందజేశామనీ టిడిపి యువనాయకులు కె. నాగన్న తెలిపారు. ముచ్చుమర్రి గ్రామపెద్ద మనిషి అబ్రహం, పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికై ధర్నా

– జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టిన పీడీఎస్ఓ నాయకులు

ఆదోనిటౌన్, జూలై28, ప్రభాతవార్త :



విద్యారంగ సమస్యల పరిష్కారానికై పీడీఎస్ఓ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద విద్యార్థులు, పీడీఎస్ఓ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్ఓ రాష్ట్ర నాయకులు కె.తిరుమలేష్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి పడిందని, దీంతో తల్లిదండ్రులు ఫీజులు చెల్లించలేని స్థితిలో ఉన్నారన్నారు. రెండు నెలలు గడుస్తున్నా డిగ్రీ అడ్మిషన్లను ప్రభుత్వం నిర్వహించకుండా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. విద్యార్థులను ప్రయివేట్ కళాశాలల వైపు నెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. నూతన విద్యావిధానం-2020 విద్యారంగాన్ని అస్తవ్యస్తం చేసిందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పడిపోయేలా, శాస్త్రీయ భావాలను, చరిత్రను వక్రీకరిస్తూ సిలబస్‌ను రూపొందించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాలయాల్లో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యాబోధన నాణ్యత దెబ్బతింటోందన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ఓ జిల్లా నాయకులు సురేంద్ర, శివ, రాజేష్, ఇమ్రాన్, కార్యకర్తలు మల్లి, స్వామి సమర్థ, రాజు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## జాయింట్ అజమాయిషీ ఈ-పంట నమోదును ప్రారంభించిన అధికారులు

– పంటలను సాగుచేసిన ప్రతిరైతు పంటల నమోదు చేయించుకోవాలి
– మండల రెవెన్యూ అధికారి వెంకటరమణ, ఏఓ పవన్‌కుమార్

గడివేముల, జూలై28, ప్రభాతవార్త :



ఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగుచేసిన ప్రతిరైతు పంటల నమోదు చేయించుకోవాలని మండల రెవెన్యూ అధికారి వెంకటరమణ, మండల వ్యవసాయ అధికారి(ఏఓ) జి.కె.పవన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం గడివేముల గ్రామంలో జాయింట్ అజమాయిషీ ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాయింట్ అజమాయిషీ ఈ-పంట నమోదులో విలేజ్ రెవెన్యూ అధికారి, విలేజ్ సర్వేయర్, విలేజ్ అగ్రికల్చర్ సిబ్బంది తదితరులు జాయింట్‌గా వెళ్లి ప్రతి సర్వే నంబర్‌కు వెళ్లి ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పతకాలైన పంట నష్టపరిహారం, పంటలబీమా, సున్నావడ్డీ, పంట కొనుగోలు అందుతాయన్నారు. అందుకు రైతులందరూ తప్పకుండా పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## గణేకల్లు బుక్ కీపర్ తొలగింపుపై పొదుపు మహిళల ఆందోళ..!

: ధర్నాకు సంఘీభావంగా సిపిఎం నేతల మద్దతు!
: 18 ఏళ్లగా పనిచేస్తున్న అర్థాంతరంగా తొలగిస్తే మా పరిస్థితి ఏంటి?..
: బుక్ కీపర్ ఆవేద నపాలకుల ఒత్తిడితోనే తొలగింపు – అధికారుల అంగీకారం!

ఆదోని, జూలై 28, ప్రభాతవార్త :



గణేకల్లు గ్రామంలో 18 సంవత్సరాలుగా గ్రామ బుక్ కీపర్‌గా సేవలందిస్తున్న ఎం. నాగవేణిని అకారణంగా తొలగించడంపై గ్రామ పొదుపు సంఘాల మహిళలు సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీగా ధర్నాకు దిగారు. గ్రామస్థుల అభిప్రాయాన్ని తీసుకోకుండానే, రాజకీయ ఒత్తిడితో సి.లక్ష్మీనరసమ్మను కొత్త బుక్ కీపర్‌గా ఆన్లైన్‌లో నమోదు చేయడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ధర్నాకు భాగ్యలక్ష్మి గ్రామ సంఘం అధ్యక్షురాలు బీ. హనుమక్క నాయకత్వం వహించగా, సిపిఎం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి లింగన్న, కార్యవర్గ సభ్యులు వీరారెడ్డి, ఎంపీటీసీ లక్ష్మి తదితరులు సంఘీభావం తెలిపారు. డబ్బులు ఇచ్చినవారికే పదవులా?", "నిజాయితీగా పని చేసినవారిని ఎందుకు తొలగిస్తున్నారు?" అంటూ మహిళలు నినాదాలు చేశారు. నాగవేణి మాట్లాడుతూ –"జీతం లేకుండా 13 ఏళ్లుగా స్వచ్ఛందంగా సేవలు అందించాను. కాంగ్రెస్, టిడిపి, వైసీపీ – అన్ని ప్రభుత్వాల హాయాల్లో నేను పనిచేశాను. 2007లో ప్రారంభమై, 2024 వరకు అంకితభావంతో పని చేశాను. అప్పుడు తొలగించలేదే, ఇప్పుడు ఎందుకు తొలగిస్తున్నారు?" అని వేదన వ్యక్తం చేశారు. "కొత్త బుక్ కీపర్ వస్తే మా లోన్ ఖాతాలు తారుమారవుతాయి. లావాదేవీలు గందరగోళమవుతాయి" అని పొదుపు మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది వ్యక్తిగత సమస్య కాదని, 65 పొదుపు సంఘాల మహిళల ప్రశ్న అని అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారులు స్పందిస్తూ "ఐదుగురు ప్రతినిధులచే స్పందన అర్జీ ఇవ్వండి" అని సూచించగా, "తాము మొత్తం గ్రామాల తరపున వచ్చాం, అధికారి స్వయంగా వచ్చి హామీ ఇవ్వాలి" అని మహిళలు పట్టుబట్టారు. అనంతరం ఏవో వసుంధర వచ్చి "ఈ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాను" అని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా ధర్నా విరమించారు. వెలుగు ఏపీఎం వీరన్న, వెలుగు సిసి రవి మాట్లాడుతూ అధికార కూటమి నాయకుల ఒత్తిడితోనే ఆన్లైన్‌లో మార్పు జరిగింది. త్వరలో గ్రామ సభ నిర్వహించి సభ్యుల అభిప్రాయంతో నిర్ణయం తీసుకుంటాం" అని తెలిపారు. ఈ ధర్నాలో గణేకల్లు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సిపిఎం నేత వీరారెడ్డి మాట్లాడుతూ – "డబ్బుతో పదవులు కొంటున్న ఈ వ్యవస్థను ప్రజలు ఎదిరించాలి. అవసరమైతే వంటవార్పుతో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మళ్లీ ధర్నా చేస్తాం" అని హెచ్చరించారు.

## ఆర్టీసీ ఉద్యోగుల విధులకు అటంకం కల్పిస్తే కేసులే

నందికొట్కూరు, జూలై 28, ప్రభాతవార్త:



ఇకపై ఆర్టీసీ ఉద్యోగుల విధులకు అటంకం కల్పిస్తే కేసులేనని దానికి సంబంధించిన పోస్టర్లను నందికొట్కూరు డిపో మేనేజర్ విడుదల చేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు విధులలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తించిన దాడికి యత్నించిన , విధులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరంగా ఏపి సెక్షన్ల కింద కేసులు విధించే పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఇటీవల కాలంలో ఉద్యోగులపై ధుర్భషలాడడం దాడులకు పూనుకోవడం పరిపాటిగా మారిందని, ఉద్యోగులకు భద్రత కల్పించడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోస్టర్‌ను ఆవిష్కరించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కూటమి ముసుగులో వైసిపి మూకలు..!

ఆదోని రూరల్, జూలై 28, ప్రభాతవార్త:



ఆదోని మండల పరిధిలోని గనేకల్లు గ్రామ మాజీ విలేజ్ బుక్ కీపర్ నిర్వాహకం ఆశ్చర్యానికి గురిచేసింది. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ముందు సోమవారం గణేకల్ గ్రామానికి చెందిన పొదుపు సంఘాలు మహిళలు ధర్నాకు దిగారు. గ్రామానికి చెందిన బుక్ కీపర్ నాగవేణి గత 25ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె ఎలాంటి అవినీతికి పాల్పడ లేదని ఆమెను బుక్ కీపర్ నుండి తొలగించడం సమంజసం కాదని ప్రజా సంఘాలు నిరసనకు దిగారు. అయితే విషయం ఏమిటంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత వైసీపీ హయంలో అవినీతికి పాల్పడిన వారిపై రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి ఆరోపణలతో అధికారులు తొలగి స్తున్నారు. ఇందులో భాగంగానే గణేకల్ గ్రామానికి చెందిన బుక్ కీపర్ నాగవేణిని తొలగించారు. దీనిని జీర్ణించుకోలేక తనే బుక్ కీపర్ అంటూ సోమవారం పొదుపు మహిళలకు అధికారులతో సమావేశం ఉందని నమ్మబలికి నాలుగు ఆటోల్లో పట్టణానికి తీసుకొచ్చి సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ప్రజా సంఘాల నాయకులతో కలిసి ధర్నాకు పూనుకుంది. కూటమి నాయకులు మహిళలు విచారించగా ప్రస్తుతం నాగవేణి బుక్ కీపర్ గా ఉన్నానని అధికారులతో సోమవారం సమావేశం ఉందని పొదుపు సంఘాల మహిళలందరూ రావాలని ఆటోల్లో తీసుకొచ్చి నట్టు తెలిపారు. ఇది ముమ్మాటికి కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కూటమి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే అవినీతి ఆరోపణలతో తొలగించబడిన బుక్ కీపర్ నాగవేణికి దగ్గరి సంబంధం ఉన్న బీజేపీ నాయకులు ఈ ధర్నా వీడియోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. దీనిపై కూటమిలో వైసీపీ ముసుగు దొంగలు ఉన్నారని ఐటీడీపీ మండల అధ్యక్షులు గణేకల్ విరూపాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ఎమ్మెల్యే పార్థసారధిపై ప్రజాసంఘాలు చేసిన విమర్శలు బిజెపి నాయకులే సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంపై ఐటిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భక్తిశ్రద్ధలతో నాగులచవితి పండుగ వేడుకలు

బనగానపల్లె రూరల్, జూలై 28, ప్రభాతవార్త:



పవిత్ర శ్రావణమాసంలో రోజుకో విశిష్టత ఉంది. అందులో భాగంగానే సోమవారం నాగులచవితి సందర్భంగా పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుండే మహిళలు నగులకట్టల వద్ద, ఆయా ఆలయాల్లోని నాగుల విగ్రహాలకు, నాగుల పుట్టల వద్ద పాలు పోసేందుకు బారులు తీరారు. శ్రావణమాసంలో వచ్చే నాగుల చవితి, పంచమిలను రాయలసీమలో మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. నాగులచవితి రోజు ఉపవాసం ఉండి నాగులకు ఇష్టమైన పెలాలు, పాలు, నైవేద్యం, పండ్లు వంటివి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. మరుసటి రోజు పంచమి రోజు నాగులకు పాలు పోసి తమను చల్లగా చూడమని నాగులను భక్తులు కోరుకుంటారు. నాగుల పంచమి రోజు కొత్తగా పెళ్లి అయిన దంపతులతో నాగులకు పాలు పోసి పూజిస్తారు. దీంతో నాగదేవత ఆశిస్సులు వారికి కలుతాయని నమ్మకం. బనగానపల్లె , పరిసర గ్రామాల్లోని ఆలయాల్లో ఉన్న నాగదేవత విగ్రహాలకు, నాగుల పుట్టలకు భక్తులు పాలు పోసి నాగుల పంచమిని జరుపుకున్నారు. సంతానం లేని వారు భక్తిశ్రద్ధలతో నాగులను పూజించడంతో, నాగదేవత అనుగ్రహం లభించి సంతానం కలుగుతారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.పలు దేవాలయాల్లో మహిళల సందడి నెలకొంది. శివాలయాల్లో నాగులకు అభిషేకం చేసేందుకు జంటలు పొటెత్తారు. మొత్తానికి భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## ప్రతి రైతు సోసైటి అభివృద్ధికి సహాకరించాలి

తుగ్గలి, జూలై 28, ప్రభాతవార్త :



రైతులు సాగుబడి కోసం సొసైటిలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సోసైటి అభివృద్ధి బాటలో తీసుకెళ్ళేందుకు సహాకరించాలని ఉప్పర్లపల్లి సోసైటి చైర్మన్ అప్పా వేణుగోపాల్ రైతులను కోరారు. సోమవారం మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలోని ఉప్పర్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహాకార పరపతి సంఘం భవనం నందు నూతన సోసైటి చైర్మన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతు రైతులు తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లించాలని లేని పక్షంలో వడ్డీ ఎక్కువ అయి ఇబ్బందులు పడుతారని ఇది రైతులకు నష్టమని, రైతుల కోసం ఏర్పాటు చేసిన సోసైటిని కాపాడుకోవలసిన భాధ్యత రైతులదేనన్నారు. సిబ్బందికి ఆయన పలుసూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఈఓ గిద్దయ్య, అసిస్టెంట్ సీఈవో నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం మత్తు.. ప్రమాదకరం - ఎస్సై సురేష్

వెలుగోడు, జూలై28, ప్రభాతవార్త :



వాహనాదారు మద్యం మత్తులో నడపం ఎంతో ప్రమాదకరమని దాని వల్ల మీ ప్రాణాలకు గాని ఎదుటి వాహదారుల ప్రాణాలకు ప్రమాదం అని ఎస్సై సురేష్ అన్నారు. సోమవారం ప్రధానసెంటర్, పెట్రోల్‌బంకు సమీపంలోడ్రంక్ అండ్ డ్రైవ్ ,వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా వాహనాలకు సంబందించిన రికార్డులేని, డ్రైవింగ్ లైసెన్స్ లేని ఇలా పలు కేసులు నమోదు చేసి జరిమానా విధించి ఒక డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూవాహనాలు నడిపే వారు నిర్థిష్ట వేగంలో నడిపి సురక్షితంగా గమ్య చేరాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, రహదారి సూత్రాలను పాటించాలన్నారు. సిబ్బంది శివయ్య, రాంనాయక్‌లు పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వంలోనే ప్రజలకు ఎన్నో సేవలు

: కూటమి ప్రభుత్వ సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు మోసం : శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భూవనేశ్వరరెడ్డి : నియోజకవర్గం మాజీ ఎంఎల్ఏ శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాలతో బాబు షూరిటి – మోసం గ్యారెంటి

ఆత్మకూరు, జూలై28, ప్రభాతవార్త :



గత వైసిపి ప్రభుత్వంలోనే ప్రజలకు ఎన్నో విదాలుగా సేవలు అందించి ప్రజా శ్రేయోస్సు కోసం పాటుపడే పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అని శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భూవనేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని గరీబ్‌నగర్‌లో నియోజకవర్గం మాజీ ఎంఎల్ఏ శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాలతో బాబు షూరిటి – మోసం గ్యారెంటీ అనే కార్యక్రమం ప్రారంభించారు. ముందుగా వైసిపి నాయకులు 16వ వార్డు కౌన్సిలర్ కురుపాటి విజయ్‌చౌదరి పూలపూష్పంతో శిల్పా భూవనేశ్వరరెడ్డిని గౌరవంగా ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శిల్పా భూవనేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలతో పరిపాలన కొనసాగిస్తుందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన షూరిటి బాండ్లను ప్రజలకు చూపిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోస పూరితమైన పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం పాటుపడుతూ ప్రజలకు కూటమి పాలన చేస్తున్న తప్పులను ఎత్తిచూపేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదలచేసిన క్యూ ఆర్‌కోడ్‌ను ప్రజలతో స్కాన్ చేయించి ముఖ్యమంత్రిమోసాలను తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, డీలరు రమణ, బాపణంతాపురం రాజేష్, రాష్ట్ర మైనార్టీ నాయకులు బీసీ మాజీ కార్పోరేషన్ డైరెక్టర్ అంజాద్ అలి, మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు సొంపల్లె దనుంజయుడు, శ్రీశైలం నియోజకవర్గం బిసి సెల్ నాయకులు వరకవి నాగరాజు, జయకృష్ణ, ఎస్సీ ఎబిఎం పాలెం నాయకులు చిలుక ప్రభుదాసు, పాన్‌బాష, ముర్తుజా, మాజీ మార్కెట్‌యార్డు ఉపాధ్యాక్షులు, వార్డు కౌన్సిలర్లు పాణ్యం పార్వతి, సుగునమ్మ, రంగస్వామి, మారుబోతుల విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుధర కల్పించాలి

పత్తికొండ, జూలై 28, ప్రభాతవార్త :



రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, కౌలు రైతులకు వెంటనే కౌలు కార్డులు ఇవ్వాలని రైతు సంఘం మండల ఉపాధ్యాక్షులు పెద్దముని తెలిపారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పందికోన గ్రామ సచివాలయం వద్ద ధర్నా చేసి విలేజ్ అగ్రికల్చర్ అధికారి జయచంద్రగౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ విధ్యుత్ స్మార్ట్ మీటర్లను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు రవికుమార్,,వ్యవసాయ కార్మీక సంఘం మండల కార్యదర్శి చిన్న మునిస్వామి, ఏఐవైఎఫ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పెద్దయ్య, ఓబులేషు రైతులు పాల్గొన్నారు.

## పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

గూడూరు,జూలై 28, ప్రభాతవార్త ః



గూడూరు,సి.బెళగల్ మండలాలల్లోని ఆయా గ్రామాలల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలపై రైతులకు పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సులను నిర్వహించారు. సోమవారం ఆయా గ్రామాలల్లో సాగు చేసిన పంటలపై అధికారులకు పంటల సమగ్ర శస్యరక్షణ చర్యలపై మెళుకువల గురించి వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు రైతులకు సాగు చేసిన పంటలపై పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా పంటల సాగుపై వినియోగించాల్సిన ఎరువల వాడకాలపై కూడా రైతులకు ప్రత్యేక శిక్షణలు ఇచ్చారు. వీటిలో భాగంగా ప్రస్తుతం సాగు చేసిన పంటలకు యూరియా ఎరువుతో అనుగుణంగా కొత్తగా మార్కెట్‌లో వచ్చిన నానో యూరియాను వాడకంలో తెచుకోవాలని సూచించారు. నానో యూరియాతో అనేక ప్రయోజనాలున్నాయన్నారు. జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.వెంకటేశ్వర్లు, కోడుమూరు ఎడిఏ సాలురెడ్డి, ఉద్యాన వన అధికారి మదన్‌మోహన్, సాంకేతిక వ్యవసాయ అధికారి శ్రీవర్ధన్‌రెడ్డి, కోడుమూరు వ్యవసాయ అధికారి రవిప్రకాష్, గూడూరు మండల వ్యవసాయ అధికారులు మల్లేష్, దస్తగిరిరెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారులు మహేష్ పాల్గొన్నారు.

## అత్యవసర సేవలకు మాత్రమే 108 వాడండి

–మేనేజర్ సంజీవరెడ్డి

కొలిమిగుండ్ల, జూలై 28, ప్రభాతవార్తః



కొలిమిగుండ్ల మండలంలోని 108 వాహనాని ్న సోమవారం ఉమ్మడి జిల్లా 108 సర్వీసు మేనేజర్ సంజీవరెడ్డి 108 వాహనాన్ని తనిఖీచేశారు. ఈసందర ్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాద సమయం, గర్భవతులు, తేలు కాటు, పాముకాటు, విద్యుత్‌షాక్, తదితర ఎమర్జెన్సీ సమయంలో మాత్రమే 108 అంబులెన్స్‌ను ఉపయోగించుకోవాలని చిన్న చిన కారణాలచేత ఈ సర్వీసును ఉపయోగించుకోవడం పెద్ద ప్రమాదాలు జరిగిన వారికి 108 సర్వీసు అందకుండా ప్రమాద సమయంలో వారు ఇబ్బందులు పడి ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుందని అందువల్ల అత్యవసర సేవలకు మాత్రమే ఈ 108 వాహనాన్ని ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో టెక్నిషియన్ చంద్రనాయక్, ఫైలెట్ చిన్నయ్య, పవన్ గోపాల్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ యేడాది పాలన విజయవంతం

– సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న యూనిట్ ఇన్‌చార్జి మల్లెపల్లి రంగడు

దేవనకొండ, జూలై28, ప్రభాతవార్త;



కూటమి ప్రభుత్వ యేడాది పాలన విజయవంతమయ్యిందని యూనిట్ ఇన్‌చార్జి మల్లెపల్లి రంగడు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని పి.కోటకొండ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదానని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు హయాంలో వచ్చే నాలుగేళ్లలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలైన సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, మరుగుదొడ్ల నిర్మాణాలు జరుగుతాయన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేరుగా తమదృష్టికి తీసుకురావాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉరుకుందకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు

– భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధిక సంఖ్యలో బస్సు సర్వీసులు
– ఆర్టీసీ డీఎం మహమ్మద్‌రఫిక్

ఆదోనిలీగల్, జూలై28, ప్రభాతవార్త;



ప్రసిద్ధగాంచిన ఉరుకుంద ఈరన్నస్వామివారి శ్రావణమాస ఉత్సవాలకు ఆదోని ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మహ్మద్‌రఫిక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడూత ఈనెల 25వ తేదీ నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు ఉరుకుంద ఈరన్నస్వామివారి శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా ఆదోని నుంచి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉరుకుందకు బస్సు సర్వీసులను నడుపుతామన్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకు ఈ బస్సు సర్వీసులు నడుస్తాయన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిరోజూ పది నుంచి 45 బస్సు సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్సు సంఖ్యను పెంచుతామన్నారు. ఆదోని డిపోలో సంస్థకు అవసరమైనప్పుడు సేవలు అందించేందుకు ఆన్ కాల్ డ్రైవర్స్‌గా పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కావాలన్నారు. ఆదోని ఆర్టీసీ డీఎం కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. అర్హతలు హెవీ డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి అని, కనీసం 18 నెలల డ్రైవింగ్ అనుభవం ఉండాలన్నారు. డ్యూటీ డ్రైవర్లకు ఒక రోజు వేతనం రూ.800, బడి బస్సు డ్రైవర్లకు రూ.600 చెల్లిస్తామన్నారు.

## మద్దికెర వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం

– రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తాం – వ్యవసాయ పరపతి సంఘం అభివృద్ధికి కృషి చేస్తాం – చైర్మన్, డైరెక్టర్లు

మద్దికెర, జూలై28, ప్రభాతవార్త :



మండలకేంద్రమైన మద్దికెరలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్గఆ ఆకుల ఆనంద్, డైరెక్టర్లుగా చిన్నపెద్దన్న, సుగులప్ప సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామ ప్రజలకు సొసైటీ అభివృద్ధికి, సేవచేయడానికి అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు మండల టీడీపీ నాయకులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్, డైరెక్టర్లు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. వ్యవసాయ పరపతి సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు పురుషోత్తంచౌదరి, రాజన్నయాదవ్, టీడీపీ జిల్లా పార్లమెంట్ కార్యదర్శి గూడూరు ధనుంజయయాదవ్, బురుజుల సొసైటీ చైర్మన్ ఎర్రిస్వామి, టీడీపీ మండల కన్వీనర్ న్యాసరి లక్ష్మీనారాయణ, తాలూకా టీడీపీ తెలుగు యూత్ నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, టీడీపీ ఎమ్మార్పీఎస్ నాయకులు పారా రాఘవేంద్ర, విటోబ, యువ నాయకులు ఆకుల వేణుగోపాల్, మద్దికెర మంగళ శేఖర్, సహకార బ్యాంకు సీఈఓ నాగరాజు, ఎర్రిస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మించాలి

– రైతుసంఘం నాయకుల డిమాండ్

కౌతాళంరూరల్, జూలై28, ప్రభాతవార్త;



తుంగభద్ర నదిపై వరదకాలువ నిర్మించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, మండల కార్యదర్శి బి.ఈరన్న, నాయకులు ఉలిగయ్య, వలి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు మాట్లాడుతూ ఈ యేడాది వర్షాలు పుష్కలంగా రావడం వల్ల జూలై నెలలో తుంగభద్ర నది నిండి గేట్లు ఎత్తడం జరిగిందన్నారు. తుంగభద్ర నదిని సందర్శించడం జరిగిందన్నారు. డ్యాం నుంచి 90 వేల క్యూసెక్కుల నీటిని నదికి వదిలారన్నారు. ఆ వరదనీరు వృథాగా సముద్రం పాలవుతుందన్నారు. ఆ నీటిని వరద కాలువ నిర్మించుకుని ఆ నీటిని మనం వినియోగించి ఉంటే మన ప్రాంతం సస్యశ్యామలమవుతుందన్నారు. ఈ దిశగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. తుంగభద్ర నదిపై నిర్మిస్తున్న కుంబలూరు, చీకల పర్వి దగ్గర బ్రిడ్జిని అర్ధాంతరం నిలిపి వేశారన్నారు. ఆ బ్రిడ్జిని వెంటనే తిరిగి ప్రారంభించాలన్నారు.

# రాష్ట్రంలో నంద్యాల జిల్లాను బిజెపి కంచుకోటగా మార్చడమే నా ధ్యేయం..

: జిల్లాలో నామినేటెడ్ పోస్టుల్లో అర్హులైనవారికి అవకాశం కల్పించండి...
: జిల్లాను స్పిరుచువల్ హబ్ గా అభివృద్ధి చేయండి.
: కుటుంభం కోసం కష్టపడేవిదంగా...పార్టీ కోసం కష్టపడతాం.
: బిజెపి నంద్యాల జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు.



**నంద్యాల జూలై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో నంద్యాల జిల్లాను బిజెపి కంచుకోటగా మార్చడమే నా ధ్యేయమని నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు పేర్కొన్నారు.సౌజన్య కన్వెన్షన్ హాల్ లో జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు ఆధ్వర్యంలో నిర్వహించిన బిజెపి పార్టీ కార్యకర్తల సమావేశానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి. ఎన్.మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అభిరుచి మాట్లాడుతూ నవ నందుల నిలయం నంద్యాలకు విచ్చేసిన బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి. ఎన్.మాధవ్ కు హృదయపూర్వక స్వాగతం పలికారు. అధ్యక్షులు అయిన తర్వాత రాయలసీమార్యతనలో భాగంగా నంద్యాలకు రావడం సంతోషంగా ఉందన్నారు.ద్వాపర యుగంలో భారత యుద్ధంలో ఆ మాధవుడు అంటే శ్రీ కృష్ణ పరమాత్మ అర్జునుడికి రథసారధి అయ్యి పాండవులను గెలిపించి రాజ్యాన్ని అప్పగించినట్టు,అదే మాధవుడి పేరు గల మీరు రాష్ట్ర బిజెపి పార్టీ రథసారధి అయి పార్టీని విజయ పాదం వైపు నడిపిస్తారని ఆశిస్తున్నామన్నారు.రాష్ట్రంలో నంద్యాల జిల్లాను బిజెపి కంచుకోటగా మార్చడం నా ధ్యేయం అన్నారు.నంద్యాల నుంచి రాష్ట్రపతి,ప్రధాన మంత్రి స్థాయి నాయకులు ఎన్నికైన చెప్పుకోతగ్గ అభివృద్ధి జరగలేదన్నారు.అభివృద్ధి జరిగింది అంటే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 11 ఏళ్లగా కేటాయిస్తున్న నిధులతోనే అభివృద్ధి చెందిందన్నారు. నంద్యాల జిల్లాలో శాశ్వత అభివృద్ధి కి బిజెపి అధిష్టానం కృషిచేయాలన్నారు. బిజెపి పార్టీ కోసం అహర్నిశలు పాటుపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల్లో అర్హులైనవారికి అవకాశం కల్పించాలన్నారు. నంద్యాల జిల్లాలో సహజంగా వెలిసిన నవ నందులు,శక్తి పీఠం,జ్యోతిర్లింగం,ప్రసిద్ధి చెందిన నరసింహక్షేత్రాలు ఉండటం వల్ల జిల్లాను స్పిరుచువల్ హబ్ గా అభివృద్ధి చేయాలని కోరారు.ఆకాశాన్ని స్కేలుతో కొలవలేము,సముద్రాన్ని గ్లాసుతో తోడలేము,ఇది ఇసుకను చేతితో ఎంచలేము అన్న సామెతలా పార్టీకి చేసే సేవలు వర్ణించలేమన్నారు. బిజెపి లో కష్టపడి పనిచేసిన వారికి ఆడిస్తాన్ తప్పక గుర్తిస్తుంది అనేందుకు నేనే ఉదాహరణ అన్నారు.అంపశయ్య మీద ఉన్న ఏపీని బిజెపి పార్టీ ఆదుకుందని అన్నారు.దేశంలో 20 కోట్ల సభ్యత్వాలు ఉన్న పార్టీలో కార్యకర్తల సమస్యలను అంబులెన్సులా కాపాడుతుందన్నారు.జిల్లాలో లక్ష సభ్యత్వానికి కృషిచేసిన కార్యకర్తలకు పాదాభివందనం అన్నారు. విశ్వ గురువు ప్రధాని మోదీ అంటే అమెరికా అధ్యక్షులు కావాలంటే మోదీ ప్రచారం చేయాల్సిన పరిస్తితి అన్నారు.కుటుంబం కోసం కష్టపడే విధంగా పార్టీకోసం కష్టపడి సంస్యగత ఎన్నికల్లో బిజెపి పార్టీ కార్యకర్తలను గెలిపించి సత్తా చాటుకుంటామన్నారు.

# ప్రజా సమస్యలను వేగవంతంగా.. పరిష్కరించండి

: అర్జీలను నాణ్యతగా పరిష్కరించండి : ఆదోని సబ్ కలెక్టర్



**ఆదోని, జూలై 28 ప్రభాతవార్త :** పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నందు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం పిజిఆర్ఎస్ లో సబ్ కలెక్టర్ పాల్గొని డివిజన్లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు.మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువు లోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ ఎల్ ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు.మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని. :1. పెద్దకడుబూరు మండలం కంబలదిన్నె గ్రామానికి చెందిన నరసప్పకు సంబంధించి సర్వేనెంబర్ 200/ఏ 2 నందు 0.25 సెంట్ల భూమి పెద్దలను సంక్రమించినదని, ప్రస్తుతం సదరు భూమిని కొందరు దౌర్జన్యం చేస్తున్నారని, దయతో విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ సమర్పించుకున్నారు.2. నందవరం మండలం హలహర్వి గ్రామానికి చెందిన అల్లిపిర సంబంధించి సర్వేనెంబర్ 173 బి,హెచ్ 1 నందు 64 సెంట్లు మరియు 173బి 1 నందు 10 సెంట్ల భూమి ఆన్లైన్లో వేరే వారి పేరు చూపిస్తుందని, దయతో విచారణ చేసి ఆన్లైన్ నందు నా యొక్క పేరు నమోదు చేయాలని అర్జీ సమర్పించుకున్నారు.3. గత 30 సంవత్సరాలుగా ఆదోని పట్టణంలోనే నివాసం ఉంటున్నాము ఇప్పటివరకు మాకు ఎటువంటి ఇంటి స్థలం మంజూరు కాలేదని, దయతో విచారణ చేసి ఇంటి పట్టా మంజూరు చేయాలని ఆదోని పట్టణం కార్వాన్ పేట కాలానికి చెందిన వెంకటలక్ష్మి అర్జీ సమర్పించుకున్నారు.4. ఆదోని పట్టణం నుండి పర్వతాపురం ఏరియా వరకు రోడ్డు సరిగ్గా లేదని, ప్రజలు నిత్యం పట్టనానికి వివిధ పనులు నిమిత్తం వస్తూ ఉంటారని, వర్షాకాలం అయినందున గుంతలు ఎక్కువగా ఉండటం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, దయతో రోడ్డు యొక్క మరమ్మత్తుల పనులు చేపట్టాలని డివైఎఫ్ఐ టౌన్ కమిటీ బి వెంకటేష్, మోహన్, అర్జీ సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయపు కార్యాలయపు పరిపాలన అధికారి వసుంధర, డిఎల్పిఒ తిమ్మక్క, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాసరాజు, ఆదోని డివిజన్ వ్యవసాయశాఖ అధికారులు బాల వర్ధి రాజు,ఆర్టీవో పరిపాలన అధికారి రమాదేవి, ఉప తహశీల్దారు బాబు, పౌర సరఫరాల శాఖ ఉప తహశీల్దారు రుద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నేడు కర్నూలుకు రాక

: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ



**కర్నూలు విద్య జూలై 28,ప్రభాతవార్త:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. రాయలసీమ జిల్లాల పర్యటనలో భాగంగా ఆయన కర్నూలు కు రానున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. ఉదయం ఛాయ్ పే చర్చ, మధ్యాహ్నం భారీ ర్యాలీ అనంతరం విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం లో పాల్గొంటారు. రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనలో బీజేపీ లో చేరికలు ఉన్నాయని తెలిపారు.

## రేపు మంత్రులు బీసీ, ఆనం కొలిమిగుండ్లకు రాక

**కొలిమిగుండ్ల, జూలై 28, ప్రభాతవార్తః** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక కార్యక్రమంలో పాల్గొనడానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డిలు సంయుక్తంగా బుధవారం 30-07-2025న ధ్వజస్థంభ ప్రతిష్టకార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్నట్లు మండల టిడిపి ప్రచార కార్యదర్శి శివరామిరెడ్డి తెలిపారు.

## హంద్రీ నీవాను సంధర్శించిన ఎమ్మెల్యే, గౌరు,

**నందికొట్కూరు,జూలై 28,ప్రభాతవార్త:** మల్యాల హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకంను నందికొట్కూరు నియోజకవర్గం శాసనసభ్యులు గిత్తా జయసూర్య, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి సోమవారం సంధర్శించారు. ఏడు పంపుల ద్వారా విడుదల అవుతున్న నీటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియా కోసం పడిగాపులు



**కొత్తపల్లె, జూలై 28, ప్రభాతవార్తః** యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు కొత్తపల్లె మండల కేంద్రంలోని నాగంపల్లి సొసైటి వద్దకు యూరియా లారీ వస్తుందన్న సమాచారంతో రైతులు పరిసర గ్రామాల నుండి తరలివచ్చారు. సంచులు అన్‌లోడ్ చేసే వరకు వేచి ఉండి యూరియా తీసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా అందించాలని రైతులు కోరుతున్నారు.

## భూ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



**కొత్తపల్లే, జూలై 28, ప్రభాతవార్తః** భూ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం అవుతుందని కొత్తపల్లె తహాశీల్దార ఉమారాణి అన్నారు. బట్టువారి పల్లె గ్రామంలో రీ సర్వే పనులు పూర్తి అవడంతో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. రీ సర్వేతో వారి పొలాల్లో ఏమైన అభ్యంతరాలు ఉంటే తమదృష్టికి తేస్తే పరిస్కరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహాశీల్దార్ పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై వేదింపుల కేసు నమోదు

**కొత్తపల్లె, జూలై 28, ప్రభాతవార్తః** మహిళలను వేధిస్తున్న ఓ వ్యక్తిపై వేదింపుల కేసు నమోదుచేసినట్లు కొత్తపల్లె ఎస్ఐ శివశంకర్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని బోయలకుంట్ల గ్రామానికి చెందిన నరాల శివరామిరెడ్డికి ఇద్దరుకూతుళ్లు పెద్ద కూతురు నరాల రేణుకమ్మను చిన్న కూతురైన జ్యోతిర్మయి భర్త అయినటువంటి మధుసూధన్‌రెడ్డి తరచు వేదిస్తున్నారని తెలిపారు. మధసూధన్‌రెడ్డి ప్రతిరోజు రేణుకమ్మను చరవాణిలో దుర్భాషలాడుతూ అసభ్యపదజాలంతో మాట్లాడుతూ ఇతర వ్యక్తులతో అక్రమ సంబంధాలు అంటగడుతూ నిత్యం వేధిస్తున్నారని చెప్పారు. ఇలా వేదిస్తు తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆమె అతనిపై ఫిర్యాదుచేసిందని పేర్కొన్నారు. రేణుకమ్మ ఇచ్చిన ఫిర్యాదుమేరకు

## ప్రజలందరికీ జీవితాల్లో నూతన వెలుగులు నింపాలి..

: రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్...



**కర్నూలు విద్య జూలై 28,ప్రభాతవార్త:** నాగుల చవితి వేడుకలను పురస్కరించుకొని నగరంలోని తన నివాసంలో ఉన్న నాగల కట్ట వద్ద రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ దంపతులు పూజలు నిర్వహించారు. నాగుల చవితి సందర్భంగా ప్రతి సంవత్సరం తమ నివాసంలో ఉన్న పుట్ట వద్ద ప్రత్యేక అలంకరణలు చేయడంతో పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇదే క్రమంలో ఈ ఏడాది కూడా నాగుల చవితి సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ దంపతులతో పాటు సమీప ప్రాంతంలోని ప్రజలు కూడా వచ్చి ఇక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నాగుల చవితి ప్రజలందరికీ జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ఆకాంక్షించారు.

# మానవ అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలి

: చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 18001027222కు సమాచారం ఇవ్వండి : జిల్లా కలెక్టర్




**నంద్యాల జూలై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** మానవ అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలని వాటి నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజ కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....పిల్లల అక్రమ రవాణాకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. ఎక్కడైనా అక్రమ రవాణా జరుగుతుందని తెలిసి నట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి లేదా 1800 1027222 కు సమాచారం ఇస్తే వెంటనే సంబంధిత శాఖల సమన్వయంతో వెంటనే బాలల రక్షణ కోసం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం, ప్రతి సంవత్సరం జూలై 30న జరుపుకుంటున్నామన్నారు. ఆ రోజున మానవ అక్రమ రవాణాపై వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మానవ అక్రమ రవాణా అనేది ఒక తీవ్రమైన నేరంగా పరిగణించాలన్నారు. దీనికి బాధితులుగా స్త్రీలు, పిల్లలు, వలసదారులు మరియు ఇతర బలహీన వర్గాల ప్రజలు ఎక్కువగా ఉంటారన్నారు. అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అవగాహన కల్పించి, బాధితులకు సహాయం చేయాలని తెలిపారు. జిల్లాలో హెల్త్ ఎడ్యుకేషన్ మరియు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి మానవ అక్రమ రవాణా పై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు.అనంతరం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో శ్రీ శిశు సంక్షేమ శాఖ పిడి లీలావతి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంపత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బాబు ష్యూరిటి-మోసం గ్యారెంటీ మంచి స్పందన



**కోవెలకుంట్ల,జూలై 28,ప్రభాతవార్త:** కోవెలకుంట్ల మండల పరిధిలోని వెలగటూరు గ్రామంలో వైసిపి చేపట్టిన బాబు ష్యూరిటి...మోసం గ్యారెంటీ కార్యక్రమానికి విశేష స్పందన లభించింధి. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతు బనగానపల్లె నియోజకవర్గంలో అడుగడుగున టిడిపి నాయకులు, కార్యకర్తలు పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలంటూ మోసం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక పించన్ తప్ప ఏ ఒక్క పథకం అమలు చేయలేని చేతకాని కూటమి ప్రభుత్వం అని తెలిపారు.. రైతులకు ఏ ఒక్క పంటకు నష్టపరిమారం ఇవ్వలేదని, రైతులకు యూరియా అంధించలేక ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆయన ఎద్దేవ చేశారు. మంత్రి బీసి జనార్ధన్‌రెడ్డి అవినతికి అంతే లేకుండా పోయిందని, వైయస్సార్సీపి నాయకులపై కార్యకర్తలపై అక్రమ కేసులతో తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే ఉండదని, వైసిపి కార్యకర్తల కోసం పాఆర్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

# శోభాయమానంగా.. బిజెపి శోభాయాత్ర

- వేలాది మందిగా నాయకులు, కార్యకర్తల మధ్య శోభాయాత్ర
- ఆకట్టుకున్న ఒంటెలు అశ్వాలు,రాముడు,హారిదాసు వేషదారణలు
- కాషాయమయమైన పద్మావతి నగర్



**నంద్యాల,జూలై 28,ప్రభాతవార్త ప్రతినిధి:** నవనందుల కోటకు నిలయమైన నంద్యాల కాషాయమయమైంది. నంద్యాలలో బిజెపి కార్యకర్తలు నాయకులు ఇంత మంది ఉన్నారా ఔరా అనిపించారు. క్రమశిక్షణ,పట్టుదలకు మారుపేరైన బిజెపి నాయకులు, కార్యకర్తలు సత్తా చాటుకున్నారు. బిజెపి జోష్ నంద్యాలలో చూస్తే గతంలో దేశ ప్రధానులను అంధించిన సమయంలో ప్రపంచ దేశాలు దేశంలో అన్ని ప్రాంతాల ప్రజలు నంద్యాల గురించి చర్చించుకునే విధంగా రికార్డు సృష్టించారు.బిజెపి అధికారంలోకి వచ్చిన తురువాత రాయలసీమ లోని నంద్యాలలో జరిగిన శోభాయాత్ర సైతం అలాంటి రికార్డు సృష్టించడం అతిశయోక్తి లేదనిపించే రీతిలో సాగింది. సోమవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.యన్.మాదవ్ ఎన్నిక అయిన తరువాత స్తానిక సంస్థల్లో బూతు స్థాయి కార్యకర్త నుంచి పై స్థాయి కార్యకర్తలను బలోపితం చేయడానికి రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో పర్యటనలో భాగంగా నంద్యాలకు చేరుకున్నారు. అనతి కాలంలోనే సాధారణ కార్యకర్తగా బిజెపిలో చేరి అంచెలుఅంచులుగా బిజెపి జిల్లా అధ్యక్షులు అయిన అభిరుచి మధు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శోభాయాత్రకు రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షులు పి.వి.ఎన్.మాదవ్ రాకతో కార్యకర్తల్లో ఉత్సాహం వచ్చింది. ఈఈ నేపథ్యంలో పద్మావతి నగర్ నుంచి శోభాయాత్ర అతిరథ బిజెపి నాయకులతో ప్రారంభమైంది. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలుచమహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. నాగుల చవితి పండుగనా బిజెపి పండుగనా అనే రీతిలో యాత్ర సాగింది. ర్యాలీ ప్రారంభంలో భారత మాతకు జైజై శ్రీరామ్, దేశ ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వం వర్థిల్లాలి అనే నినాదాలు మారుమ్రోగాయి. శోభాయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తు ముందుకు సాగారు.కార్యకర్తల్లో జోష్ నింపేందుకు రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ డప్పు కొట్టి జోష్ నింపారు. శోభాయాత్ర ముందు ఒంటెలపై అశ్వాలపై స్వారీ చేస్తు శ్రీరాముని వేషధారణలు, హారదాసు కీర్తనలు, టపాసుల మోతలు, చెక్కభజనలు, కోలాటాలతో ముందుకు సాగారు భారీ పోలీసు భంధోబస్తు మధ్య మున్సిపల్ కార్యాలయం మీదుగా సాగుతు సౌజన్య కన్వెన్సన్ వద్దకు చేరుకుంది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన నాయకులు గజమాలతో స్వాగతం పలికారు.





## సబ్‌జైల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జడ్జి



**నందికొట్కూరు,జూలై 28,ప్రభాతవార్త:** పట్టణంలోని సబ్‌జైల్(ఉపకారాగారం)ను నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి మరియు మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు శ్రీమతి ఏ.శోభారాణి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా జడ్జి జైలులోని ముద్దాయిలతో మాట్లాడుతు వారి కేసుల వివరాలు, జైలులో వసతులు, భోజన సదుపాయాలు మెను ప్రకారం అందుతున్నాయా, వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయ పరమైన సమస్యలు ఉన్నచో కారాగారంలోని న్యాయ సేవా కేంద్రాన్ని సంప్రదించ వచ్చునన్నారు. అందరికి న్యాయవాది ఉన్నారా అని ముద్దాయిలను ఆరా తీసారు. న్యాయ వాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లలేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ఏమైనఫిర్యాదులను ఆన్‌లైన్ నెంబరు 15100 ద్వారా కూడా తెలియజేయ వచ్చు అన్నారు. అనంతర ఖైదీల గదులను, భోజన సదుపాయాలను పరిశీలించి జైలులోని సమస్యలను జైలు సూపరిన్ డెంట్ రఘునాథ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కె.వెంకటేశ్వర్లు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## నాటు తుపాకీ స్వాధీనం - వ్యక్తి అరెస్టు



**రుద్రవరం, జూలై 28, ప్రభాతవార్తః** నాటు తుపాకీతో అడవి జంతువులను వేటాడేందుకు అటవీ ప్రాంతంలో సంచరిస్తుండగా దాడిచేసి నాటు తుపాకీని స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టుచేసి కేసునమోదుచేయడం జరిగిందని ఇంచార్జీ రేంజ్ అధికారి ముర్తుజా వలి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు సక్రమంగా నాటుతుపాకీతో అహోబిలం, నార్తు బీట్‌లోనే నూతన బావి సమపంలో అహోబిలం గ్రామానికిచెందిన వేటగాళ్ళను గుర్తించేందుకు అటవీశాక ఉన్నతాధికారులు అదేశాల మేరకు సిబ్బందితో ఆదివారం దాడిచేయడం జరిగిందన్నారు. అహోబిలం గ్రామానికి చెందిన ప్రభాకర్ మరో ముగ్గురు కలిసి అడవిలోకి నాటు తుపాకితో వెళ్లి అడవి జంతులును వేటాడి చంపేతందుకు తిరుగుతున్నారన్న సమాచారం మేరకు దాడిచేయడం జరిగిందన్నారు. ఈదాడిలో ప్రభాకర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న నాటుతుపాకీని స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసి సోమవారం ఆళ్లగడ్డ కోర్టులో హాజరుపరచగా కోర్టు అతనికి 15 రోజులురిమాండ్ విధించడం జరిగిందన్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురిని అతి త్వరలో పట్టుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. వన్యప్రాణులకు హాని తలపెడ్డితే అలాంటివారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆయన వెంట సెక్షన్ అధికారి రామకృష్ణ, బీట్ అధికారులు నాగవుశేనయ్య, నాగేంద్రగౌడ్, ప్రొటెక్షన్ వాచర్లు సంజీవ నాయకులు ఉన్నారు.

## బాబు షూరిటీ మోసము గ్యారెంటీ

వైస్సార్సీపీ ఇంచార్జ్ బుట్టా రేణుక



**ఎమ్మిగనూరు రూరల్ జూలై 28 ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు పట్టణములో 5,6వ వార్డు లో బాబు షూరిటీ మోసం గ్యారెంటి కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప,6వ వార్డు కౌన్సిలర్ జిల్లా చేనేత అధ్యక్షులు శివప్రసాద్ పాల్గొన్నారు. ముఖ్య అతిథులు గా వైస్సార్సీపీ నియోజకవర్గం ఇంచార్జ్ బుట్టా రేణుక పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోమవారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాబు షూరిటీ మోసం గ్యారెంటి అంటూ ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ ఫ్లాప్, తల్లి కి వందనం, రైతు భరోసా, క్రాప్ ఇన్సూరెన్స్, రైతులకు భారం, గ్యాస్ సబ్సిడీ, చేనేతలకు 100 యూనిట్స్ ఉచిత పథకం మొదలగు విషయాలు అన్ని మోసం అంటూ వార్డు ప్రజలకు తెలియజేశారు. కాబట్టి జగనన్న అన్ని పథకాలు ప్రజల దగ్గర కు చేర్చారు కాబట్టి రాబోయే ప్రభుత్వం మనదే అందరూ దైర్యంగా ఉండండి అంటూ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు బుట్టా నీలకట్టప్ప, చేనేత ప్రధాన కార్యదర్శి మాచాని వెంకటేష్, నియోజకవర్గం యూత్ అధ్యక్షులు నజీర్ అహ్మద్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు బోయ బజారి,నియోజకవర్గం చేనేత అధ్యక్షులు మీసాల బండ శివ నీలకంత,టౌన్ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు,పట్టణ మహిళ అధ్యక్షురాలు లతా రెడ్డి,పట్టణ ప్రధానకార్యదర్శి గడ్డం అంజి,పాలు శ్రీనివాస రెడ్డి, బోయ రాజు,కౌన్సిలర్ అంపమ్మ, మహేబు బాషా సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.